
# సాక్షి

పాలడుగు
వెంకటేశ్వరరావు




అవును మూడు రోజులక్రితమే!
ఒక్కసారిగా వూరంతా గుప్పుమంది!
నరసయ్య మార్కెట్టులో చేపల వాసన గుబుక్కున-
గుప్పుమని ముక్కుపగిలేలాగా కొట్టినట్టు -
వూరంతా వ్యాపించింది ఆ వార్త!
ఈ దెబ్బతో రామ్మూర్తి పని 'సరి' అన్నారు
ఇక రామ్మూర్తి తలెత్తుకోలేడు
రామ్మూర్తికి పుట్టగతులుండవు
రామ్మూర్తి పరువు గంగపాలే
సాటివారిలో అతను నిలబడలేడు
ఎవరూ అతని దగ్గరకెళ్ళరు;
అతన్ని దరిజేర నివ్వరు - అనుకున్నారు.



'రామ్మూర్తికి తగినశాస్తే జరిగింది' అనుకున్నారు అతని విరోధులు.

"పాపం ఇలా ఎందుకు జరిగింది చెప్మా?" అని బాధపడ్డారు అతని స్నేహితులు.

ఆ వూరి తాలూకా ఆఫీసులో రామ్మూర్తికి పదిహేనేళ్ళ సర్వీసు వుంది.

అన్నేళ్ళ 'సర్వీసు' లోనూ రామ్మూర్తి కానిడబ్బు విలువ 'గడ్డి' అయినా కరిచి ఎరుగడు.

తన పని తాను చూసుకునేవాడు.

అటూ ఇటూగా వుండేది గాదు, అతని పని.

మెత్తబడేరకం గాదు, రామ్మూర్తి. మెత్తగా మాటలు చెప్పే మనిషీ కాదతను. దొంగలాగా చేతులు టేబులు కింద చాపి, బహుమానాలు స్వీకరించటం తెలియదు.

అందుకే...

రామ్మూర్తి ఎంత 'కరక్టు' మనిషో, అతని పనీ అంత 'కరక్టు'గానూ వుండేది. అందువలన చాలామందికి అసౌకర్యమూ అసంతృప్తీ కలిగేవి. అందుకనే రామ్మూర్తికి స్నేహితులకంటే విరోధులే ఎక్కువ.

ఆ విరోధులున్నూ రామ్మూర్తిని సాధించటానికి 'అదును' కోసం కాచుకుని ఉన్నారు. ఒకనాడా రెణ్ణాళ్ళా...ఏళ్ళే గడిచాయి.

ఇన్నాళ్ళ తరువాత వాళ్ళకి ఆ అవకాశం వచ్చింది.

వాళ్ళు విజృంభించారు!

నిప్పులేనిదే పొగ రాదన్నారు. కాకపోతే కాస్త అటూ ఇటూగా చిలవలూ, పలవలూ.

ఇదుగో, ఈ విషయంలోనూ అదే జరిగింది!

ఇంతకీ ఏం జరిగిందంటే... మొదట్నించీ చెప్పాలంటే—

ఇది నిన్నటిదీ మొన్నటిదీ కాదు.

దాదాపు పదిహేనేళ్ళక్రితం సంగతి.

రామ్మూర్తి కొత్తగా ఆ వూరు వచ్చినప్పటి రోజులు.

ఆ రోజుల్లోనేనన్నమాట విమల పుట్టింది. ఆ తర్వాత ఆరేళ్ళకి విమల తల్లిలేని దయింది. విమల రామ్మూర్తికి ఏకైక పుత్రిక; గారాబంగా చూసుకున్నాడు. విమల చిన్నప్పట్నించీ చురుకే. దానికితోడు రామ్మూర్తి విమలని తన ఉద్దేశాలకి అనుగుణంగా పెంచాడు.

భయం, బిడియం, ఆ పిల్లకి దూరంగానే వుంచాడు. సాహసం, చొరవ అలవడ్డాయి. అడవిలో పువ్వల్లే స్వేచ్ఛగా ఎదిగింది విమల

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ వుంటే ఎవరికీ తండ్రీ కూతురూ అనిపించేది గాదు; స్నేహితులు మాట్లాడుకుంటూ వున్నట్టు వుండేది. విమలకి పదిహేనేళ్ళు వచ్చాయి.

"ఏమోయ్! రామ్మూర్తీ! అమ్మాయి పెళ్ళి చెయ్యవా?" అని అడిగేవారు అతని స్నేహితులు. విరోధులు వ్యంగ్యంగా మాటలు విసిరేవారు. వొంకరగా నవ్వుకునేవారు. అన్నిటికీ వొకటే సమాధానం. వాటిని తేలిగ్గా తీసేస్తూ చిరుహాసం! అవును; రామ్మూర్తి పెదాలపై చిన్న చిరునవ్వు! అంతే.

'అసలు ఆ పిల్లకి పెళ్ళవుతుం దంటావా?'

'ఎవడు చేసుకుంటాడు, కట్నం లేకుండా?'

'రామ్మూర్తి ఎక్కణ్ణించి తెచ్చిస్తాడు కట్నం?'

"ఇప్పుడుగాని తెలిసిరాదు. ఇన్నాళ్లు కలల్లో మెదిలాడు. డబ్బు చేదా? చాదస్తంమనిషి.'

'ఊరందరిదీ ఒక దారయితే వులిపికట్టెది మరొకదారట! లేకపోతే యీ రోజుల్లో అట్లా మడికట్టుకుని కూర్చునేవాళ్ళెవరటా?—' ఇట్లా; నలుగురూ నాలుగు రకాలుగా అనుకునేవారు రామ్మూర్తిని గురించి.

అతని మంచికోరేవాళ్ళు, జాలిపడేవారు.

విరోధులు తృప్తిగా నవ్వుకునేవారు.

కాని,

అంతలోనే, అనుకోకుండా, ఆ పని జరిగింది. నలుగురికీ తెలిసిపోయింది.

ఆ రోజునుంచీ రామ్మూర్తి కనపడటం లేదట! అదీ జరిగి మూడ్రోజులయింది.

రామ్మూర్తి ఏమయ్యాడు?! గుండెపగిలిందా? మతి చలించిందా? అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడా?

ఊళ్ళో ఉండటానికి మొహం చెల్లక వూరువిడిచి వెళ్ళిపోయాడా? ఏమో?

పాపం! రామ్మూర్తి కేమయింది? చచ్చిపోయాడన్నారెవరో- ఒక చలమయ్య.

లేకపోతే అతనికి తగిలిన దెబ్బ మామూలుదా? విమల ఎంతపని చేసింది?!

తండ్రి తనకిచ్చిన స్వాతంత్ర్యాన్ని విమల ఎందుకు అట్లా ఉపయోగించుకుంది? స్త్రీని 'చంచల' అని అందుకే అన్నారు కాబోలు!

ఎవరికీ చెప్పా పెట్టకుండా, కాలేజీలో పనిచేస్తున్న 'కిరస్తానీ లెక్చరర్ని' తీసుకుని మాయమయిపోతుందా? అట్లా? మంచీ చెడూ, పెద్దా చిన్నా చూడక్కర్లా...?! పైగా, అటువంటి విషయాలు ఎంతదాచినా దాగవుగదా?

తన తండ్రి రామ్మూర్తి తనగురించి తల వొంచుకోవాల్సి వుంటుందని ఆ సమయంలో విమలకి తెలియలేదా? రామ్మూర్తి ఏమ్మనిషి? ఈడొచ్చిన పిల్లని కట్టుబాటులో వుంచుకోవద్దూ!




ఏవో? పుర్రెకో బుద్ధి అన్నారు. రామ్మూర్తి ఆలోచన్లు అతనికి భేషుగ్గానే వుంటాయేమో! విమల అట్లా, పోవటం ఆ మర్నాటినుంచీ రామ్మూర్తి అదృశ్యం కావటం — అంతకంటె రామ్మూర్తిని ద్వేషించేవాళ్ళకి మరొక అవకాశం ఏదీ? లందుకే పూరంతా గుప్పుమంది! అతని పరిస్థితి 'రామ్మూర్తి విరోధుల'కి కూడా జాలి కలిగించిందిట! మరి. మూడ్రోజుల్తర్వాత, అందుకే ఆనాడు వూళ్ళో చిన్న సభ జరిపారు, సంతాపసూచకంగా.

ఒకరొకరుగా వక్తలు . రామ్మూర్తికి కలిగిన కష్టాన్ని గురించి విశదంగా వివరంగా చర్చించి సానుభూతి వ్యక్తపరిచారు; లోలోపల సంతృప్తిపడ్తూ.

ఆ అవమానాన్ని భరించలేక రామ్మూర్తి తప్పక ఆత్మహత్య చేసుకుని వుంటాడని నిర్ధారణ చేశారు. రామ్మూర్తిని అట్లా చేసినందుకు అందరూ విమలని గట్టిగా గర్హించారు. ఆ సంఘటన పూర్వాపరాలు నలుగురూ పరిశీలించి తప్పంతా విమలదే ననీ, రామ్మూర్తి తప్పుకూడా కొంతయినా లేదని చెప్పటానికి వీలులేదనీ నిర్ణయించారు.

సభ సమాప్త మవుతూవుండగా, స్టేషన్నించి గుర్రబ్బండివచ్చి రామ్మూర్తిగారి ఇంటిముందు ఆగింది.

అందులోంచి ఒక అమ్మాయి దిగింది: 'అపిల్లేగా విమల! అరె!' అనుకున్నాడొక అంజయ్య. ఆ తరువాత నల్లగా కళకళలాడుతూవున్న మొహంతో ఆరడుగుల ఎత్తున్న ఒక కుర్రవాడు దిగేడు. సామాన్లు దింపేరు. అందరూ దిగేక ఆఖరున, చిట్టచివరికి రామ్మూర్తీ, మరొక బట్టతల సూటుమనిషీ దిగే

వాళ్ళని చూసి సభంతా వెలా తెలా పోయింది! వా ఎందుకు తిరిగివచ్చారు? ఏమో?

గుర్రబ్బండి దిగినవాళ్ళు అలా ఇంట్లోకి వెళ్ళేరో లేదో, వెనుకనే తాసిల్దారుగారు మందీ మార్బలంతో సహా ఆ యింవయిపు వెళ్ళేరు.

ఇదంతాచూసి ఆశ్చర్యం పట్టలేక ఒక వెంకటేశ్వరరా తాసీల్దారుగారి జవానుని పిల్చి సంగతేమిటని అడిగేడు.

"డిప్టీకలెక్టరుగారు గుడివాడనుంచి వచ్చేరు. వారబ్బాం కాలేజీలో లెక్చరరు. అతను ఈ వూళ్ళో వో పిల్లని ప్రేమిండట! పెద్దవాళ్ళకి భయపడి పిల్లా, పిల్లవాడూ బందరు వెపోయేరట. అక్కడ తిన్నగా కలెక్టరుదొరకి అన్నీ వివరిండట ఆ అబ్బాయి. వెంటనే డిప్టీకలెక్టరుగారికీ, రామ్మూగారికీ, మా దొరగారికీ కబురు వచ్చింద.

బందర్లోనే నలుగురి సమక్షంలో రిజిస్ట్రాఫీసులో పెళ్ళయిదట! పేపర్లోకూడా ఫొటో పడిందట. చూడలా? వర్ణాంత వివాహం! సంఘ సంస్కరణ! కలెక్టరుగారి మెప్పుదలా. ఆ" అతను హడావుడిగా వెళ్ళిపోయేడు, దవాలా సరిచేకుంటూ.

అందరూ తెల్లమొహాలు వేశారు. సంతాపసభలో నిజం సంతాపం వెల్లివిరిసింది! సరిగ్గా ఆ సమయానికి రామ్మూ తనఇంట్లో తాసీల్దారుగారూ, డిప్టీ కలెక్టరుగారూ, కూతు అల్లుడులతో కాఫీ తాగుతున్నాడు.